క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కేకే రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సిరీస్ ఫీడర్ పరిధిలోని సెంట్రల్‌బ్యాంక్ కాలనీ, సూర్యోదయ కాలనీ, సరస్వతీనగర్, మధురానగర్, హకీమాబాద్ కాలనీ పరిసర ప్రాంతాల్లో, 11కేవీ ఎల్‌బీనగర్ ఫీడర్ పరిధిలోని సరస్వతీనగర్, చింతలకుంట, సూర్యోదయకాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించగలరని ఆయన కోరారు.

టీఎన్జీఓ సెంట్రల్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా పర్వతాలు



బడంగ్‌పేట్: తుక్కుగూడ మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తెలగమల్ల పర్వతాలు టీఎన్జీఓ సెంట్రల్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారని రాష్ట్ర అధ్యక్షుడు ఎం జగదీశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2023 నుంచి 2026 వరకు 3సంవత్సరాలు పదవిలో కొనసాగుతారన్నారు. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా బరిలో ఉండి రెండోసారి విజయం సాధించడం విశేషం. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ టీఎన్జీఓ సెంట్రల్ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నాన్‌గజిటెడ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని చెప్పారు. నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల కుటుంబాలకు యూనియన్ తరుపున అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ నియామకానికి పూర్తి సహకారం అందించిన రాష్ట్ర అధ్యక్షుడు మర్రం జగదీశ్వర్‌కు, మద్దతు తెలిపిన సెంట్రల్ యూనియన్ కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న యాదగిరి

తుక్కుగూడ: మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి త్వరలో ఏర్పాటు చేయబోయే మంత్రి వర్గంలో మంత్రిగా అవకాశం కల్పించాలని తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క యాదగిరి డిమాండ్ చేశారు. శుక్రవారం రాజగోపాల్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో పాల్గొన్న వైద్యులు, నాయకులు

బడంగ్‌పేట్: ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం, బ్రాహ్మణ అభ్యుదయ పరిషత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. నాదర్‌గుల్‌లోని పీవీ నరసింహారావు మెమోరియల్ ట్రస్ట్, డాక్టర్ సుధాకిరణ్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. ఐబీఆర్ సంస్థ, కామినేని హాస్పిటల్స్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 130 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ అభ్యుదయ పరిషత్ అధ్యక్షుడు భాస్కరశర్మ, మహేశ్వరం నియోజవర్గ అధ్యక్షులు ప్రమోద్ కోటార్, నిర్వాహకులు క్రాంతికిరణ్, వెంకన్న, వంశీకృష్ణశాస్త్రి, మధు, రాజేశ్వర్‌రావు, ప్రదీప్, వినోద్, రాజేష్, రమణ గురుస్వామి పాల్గొన్నారు.

23వ డివిజన్‌లో కుక్కల పట్టివేత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలో కుక్కల ఏరివేత మొదలు పెట్టారు. కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్‌లోని రాఘవేంద్రనగర్ కాలనీలో గత కొన్ని నెలలుగా కుక్కల బెడద ఎక్కువయ్యింది. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధుల ఫిర్యాదు మేరకు అధికారులు కుక్కలను పట్టుకొని పోయే డాగ్‌టీంను రప్పించారు. ఆ టీం శుక్రవారం ఉదయం 20కి పైగా వీధికుక్కలను పట్టుకున్నారు. వారం రోజుల తర్వాత కాలనీలో మరోసారి కుక్కల పట్టివేత చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, సూపర్ వైజర్ మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు పోయేదెలా?

- ఇళ్ల పక్కనే చేరుతున్న నీరు
- రోగాల బారిన గ్రామస్తులు
- నందుపల్లిలో అడ్డుకట్ట కట్టడంతో సమస్య
- నిర్మాణ దారుడికి నోటీసులు జారీ చేసిన అధికారులు



నందుపల్లి గ్రామంలో మురుగు నీరు వెళ్లకుండా అడ్డుకట్ట నిర్మాణం

మహేశ్వరం: మండలంలో ఇళ్ల పక్కనే మురుగు నీరు చేరడంతో దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నిత్యం దోమలు, ఈగలు స్వైర్యవిహారం చేస్తూ గ్రామస్తులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. మండల పరిధిలో నందుపల్లి గ్రామంలోని డ్రైనేజీ మురుగు నీరు నందుపల్లి చెరువు కాల్వ నుంచి పెద్ద గోల్కొండ చెరువులోకి వెళ్తుంటాయి. గ్రామం నుంచి వచ్చే మురుగు నీటిని అదే గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలం నుంచి వెళ్తున్నాయని, పంట దెబ్బతింటుందని మురుగునీరు ముందుకెళ్లకుండా మట్టితో అడ్డుకట్ట వేశాడు. దీంతో గ్రామం నుంచి వచ్చే డ్రైనేజీ నీరు ముందుకు పారకుండా ఇళ్ల పక్కనే నిలుస్తుంది. దీంతో అక్కడ పెద్ద మురుగు గుంతే తయారైంది. ఈ గుంతతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ఇళ్లలోకి చొరబడి ప్రజలకు ఇబ్బంది కలిగించడంతో పాటు నిత్యం గ్రామస్తులు రోగాల పాలవుతున్నారు. గ్రామం నుంచి వచ్చే డ్రైనేజీ మురుగు నేరుగా చెరువు కాల్వలోకి వదిలితే ఎలాంటి ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. రైతులకు పట్ట పొలం ఉంటే పక్క నుంచి పెద్ద పైపులు వేసి మురుగు నీరు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. డ్రైనేజీ మురుగు నీటిని ముందుకు వెళ్లకుండా గ్రామానికి చెందిన రైతు పట్ట పొలం ఉందని సాకు చూపి అడ్డుకట్ట నిర్మాణం చేపట్టడం బాధాకరం. నందుపల్లి చెరువు నుంచి వచ్చే కాల్వ, గ్రామంలో వెలువడే మురుగు నీటిని పెద్ద గోల్కొండ చెరువు కాల్వలలోకి పోయేవిధంగా అధికారులు, గ్రామస్తులు తగు చర్యలు చేపట్టాలి. గ్రామంలో ప్రభుత్వ పొలాన్ని గుర్తించి ఆ స్థలంలో మురుగు నీరు నిల్వ ఉండే విధంగా సెప్టిక్ ట్యాంకును నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో ఇరిగేషన్ అధికారులు, ఎంపీడీఓ గ్రామాన్ని సందర్శించి ఇళ్ల పక్కన ఉన్న మురుగు గుంత సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నిలిచిన మురుగు నీరు

అడ్డుకట్టను తొలగిస్తాం..

గ్రామంలో ఇళ్ల పక్కనే డ్రైనేజీ మురుగు నీరు వెళ్లకుండా అడ్డుకట్ట వేసిన రైతుకు ఇరిగేషన్ శాఖ నుంచి నోటీసులు జారీ చేశాం. మురుగు నీటి కాల్వకు అడ్డుగా నిర్మాణాలు చేయరాదు. మురుగునీరు సజావుగా వెళ్లేవిధంగా కాల్వను వదలాలి. కాల్వలను కబ్జా చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదు. రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం.

-గోవిందు నాయక్, ఇరిగేషన్ ఏఈ, మహేశ్వరం

రోడ్డు పనులు పూర్తిచేయండి

మంత్రి కోమటిరెడ్డికి కాంగ్రెస్ నేతల వినతి



మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వెంకటేశ్‌గౌడ్ తదితరులు

బడంగ్‌పేట్: గుర్రంగూడ-అల్మాస్‌గూడ రోడ్డును బాగు చేయించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్ శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి విన్నవించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ టూ అల్మాస్‌గూడ ప్రధాన రహదారి గుంతలమయం అయిందన్నారు. గత ప్రభుత్వం రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించలేదని అన్నారు. గతుకుల రోడ్డుతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్డుపనులు పూర్తిచేసేలా చూడాలని విన్నవించారు. మంత్రి వెంకట్‌రెడ్డి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి మూడురోజుల్లో రోడ్డు పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సింహగౌడ్, సురేష్, పీర్‌సాహెబ్, సంజయ్, శ్రీధర్, గడ్డం ఎన్‌క్లేవ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించండి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని వాదే ముస్తఫా బస్తీలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని 22వ వార్డు బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి సయ్యద్ హుస్సేన్ కోరారు. ఈ మేరకు మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని శుక్రవారం కలిసి సమస్యను విన్నవించారు. హెచ్‌ఎండీఏ నిధులతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఇదివరకే శంకుస్థాపన జరిగినప్పటికీ అధికారులు పనులు ప్రారంభించడంలో అలసత్వం వహిస్తున్నారన్నారు. 21వ వార్డులో కూడా కౌన్సిలర్ షేక్ ఫమిదా అఫ్జల్ సమస్య పరిష్కారం కోసం పలుమార్లు విన్నవించారని గుర్తుచేశారు. దీంతో పాటు బక్రీద్ పండుగ సందర్భంగా పారిశుధ్య సమస్య తలెత్తకుండా అధికారులను అప్రమత్తం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని శివ గార్డెన్స్‌లో శనివారం ఉదయం 11.30 గంటలకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ ఉంటుందని అన్నారు. మండల పరిధిలోని ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఎట్టకేలకు హెచ్‌ఎం పోస్టుల భర్తీ

విధుల్లో చేరిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు



వెంకట్ రెడ్డిని సన్మానిస్తున్న పెద్దఎల్కిచర్ల గ్రామస్తులు, ఉపాధ్యాయులు

కొందుర్గు: కొంత కాలంగా కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను ఎట్టకేలకు భర్తీ చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో భాగంగా గద్వాల నుంచి గోపినాథ్ కొందుర్గు ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎంగా విధుల్లో చేరారు. అదేవిధంగా జానంపేట నుంచి గాయత్రీదేవి ముట్పూర్ జీహెచ్‌ఎంగా బాధ్యతలు తీసుకున్నారు. మైలార్ దేవునిపల్లి నుంచి ఉదయ్‌కుమార్ ఇంద్రానగర్‌కు, ఆకుతోటపల్లి నుంచి సునీత చౌదరిగూడకు, తొండుపల్లి నుంచి కిరణ్ కుమార్ ఎదిర, ఆమన్‌గల్ నుంచి వెంకట్ రెడ్డి పెద్దఎల్కిచర్లకు జీహెచ్‌ఎంలుగా శుక్రవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో జీహెచ్‌ఎంలకు గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఎంపీడీఓ సుజాత

కడ్తాల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ సుజాత అన్నారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో శుక్రవారం పారిశుధ్యంపై నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఆమె పాల్గొన్నారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశ్యంతో కాలనీల్లో చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు కలుపు మొక్కల నివారణ మందులు చల్లారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, తడి-పొడి చెత్త నిర్వాహణ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మధుసూదనాచారి, కార్యదర్శి రాఘవేందర్ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యం

కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి భీమ్‌భరత్



మాట్లాడుతున్న భీమ్‌భరత్

మొయినాబాద్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చేవెళ్ల కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి భీమ్‌భరత్ పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి ఎంచుకున్నప్పుడు ఆర్థికంగా నిలదొక్కుకుంటేనే భవిష్యత్ బాగుంటుందన్నారు. ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధిలో నాణ్యమైన సేవ చేస్తేనే వినియోగదారులు అలవాటు పడతారని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుద్యోగ యువత కోసం స్వయం ఉపాధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ కేఫ్ ఎయిర్ సంస్థ లక్ష్మిబాయి, ఊర్మిలదేవి, చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు సౌందర్యరాజన్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, మండల అధ్యక్షుడు మాణయ్య, మాజీ జెడ్పీటీసీ కంజర్ల భాస్కర్, షాబాద్ రాజు, సంజీవరెడ్డి, రాజయ్య, మర్రి రవీందర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, మక్బుల్, రమేష్, టిల్లు తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం 12వ వార్డులో గురువారం కురిసిన వర్షానికి ధ్వంసమైన కట్రోత్ భారతిరమేష్‌నాయక్ ఇంటిని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈదురుగాలులకు ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయి ఇంట్లోని ఆహార వస్తువులు, దుస్తులు, సామగ్రి దెబ్బతిని తీవ్రంగా నష్టపోయినట్లు బాధితులు తెలిపారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని, అధైర్యపడొద్దని కాంగ్రెస్ నేతలు వారికి భరోసా కల్పించారు. చందు, జగదీశ్‌యాదవ్, ఆనంద్, మరళీకృష్ణ పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



సందేశం వినిపిస్తున్న శివానందస్వామి

ఆమనగల్లు: దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని శ్రీ రామదూత ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ శివానందస్వామి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ నిత్యశుద్ధానంద స్వామి క్షేత్రంలోని శ్రీ రామదూత ఆశ్రమంలో శుక్రవారం నిత్యాశుద్ధానందస్వామి 3వ పుణ్య ఆరాధన కార్యక్రమం, 60వ విష్ణు సహస్రనామ మహాయజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఉదయం జ్యోతి ప్రజ్వలన, శ్రీ మద్భగవద్గీతా పారాయణం, శ్రీ విష్ణు సహస్రనామ యజ్ఞం నిర్వహించారు. అనంతరం శ్రీ శివానందస్వామి, గూడురు లక్ష్మణ నందగిరి స్వామి, యాదగిరిగుట్ట శ్రీ శంకరానందగిరి స్వామి, గంగాపురం ఆశ్రమ అధిపతి మల్లికార్జునానంద స్వామి సందేశాలు అందించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మన్ రామ్మోహన్, ఆశ్రమ స్థలదాతలు లక్ష్మయ్య, శ్రీనివాసులు, యాదయ్య, లక్ష్మయ్య భక్తులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

సీఐ కాశీవిశ్వనాథ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ కాశీవిశ్వనాథ్

మీర్‌పేట: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ సూచించారు. బాలాపూర్ చౌరస్తాలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు డ్రగ్స్‌వలన కలిగే అనర్థాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో డీఐ గౌరీనాయుడు, ఎస్‌ఐ సుధాకర్, కళాశాల డైరెక్టర్ రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి బారిన పడొద్దు



మహేశ్వరం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మహేశ్వరం: యువత డ్రగ్స్, గంజాయి బారినపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం మహేశ్వరం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో డ్రగ్స్, గంజాయి వాడకం వలన కలిగే నష్టాలు, సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయనే మాట్లాడుతూ.. యువత డ్రగ్స్, గంజాయికి అలవాటు పడితే శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. సమాజంలో గౌరవ మర్యాదలు కోల్పోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ధనుంజయ్, ఎస్‌ఐలు వెంకట్ రెడ్డి, రవీందర్ పలువురు పాల్గొన్నారు.

మూడు నెలలుగా జీతాల్లేవు!

ఎంపీడీఓకు హిమాయత్‌నగర్ పంచాయతీ సిబ్బంది ఫిర్యాదు



సంధ్యకు వినతిప్రతం ఇస్తున్న పంచాయతీ సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న సిబ్బందికి మూడు నెలలుగా జీతాల్లేవని, తాము ఎన్నో ఇబ్బందులు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మొయినాబాద్ మండల అభివృద్ధి అధికారి సంధ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని తెలిపారు. జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభమైనందునా స్కూల్ ఫీజులు, రేషన్, సరుకులు తీసుకోవడానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆమె గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణితో మాట్లాడారు. అటెండెన్స్ పంపించినట్లు సంధ్యారాణి ఎంపీడీఓతో చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, ప్రమీళ, అరుణ, చంద్రయ్య, అనిత తదితరులు పాల్గొన్నారు.

చదువే అన్నింటికీ మూలం

- భవిష్యత్‌కు బంగారు బాట
- న్యాయవాది నరేంద్రనాథ్



చెర్కుపల్లి పాఠశాలలో విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయులు, గ్రామస్తులు

కొందుర్గు: ప్రతి విద్యార్థి బాగా చదివి, భవిష్యత్‌ను బంగారు బాటగా మలుచుకోవాలని న్యాయవాది నరేంద్రనాథ్ పేర్కొన్నారు. చదువే అన్నింటికీ మూలం అని గురుకుల విద్యార్థులను సన్మానించిన సందర్భంగా ఆయన అన్నారు. కొందుర్గు మండలం చెర్కుపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం శివారెడ్డి శుక్రవారం గురుకుల సీట్లు సాధించిన 21 మంది విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరేంద్రనాథ్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెరుకుపల్లి పాఠశాలలో 6 సంవత్సరాల్లో 95 మంది విద్యార్థులు గురుకుల సీట్లు సాధించడం పాఠశాలలో బోధన చేస్తున్న ఉపాధ్యాయుల పనితీరుకు ఇది నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణవేణి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ లావణ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టండి

మాజీ వైస్ ఎంపీపీ నర్సింహయాదవ్



మండల వ్యవసాయ అధికారి శిరీషకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

కేశంపేట: నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని మాజీ ఎంపీపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు పసుల నర్సింహయాదవ్ పేర్కొన్నారు. మండలంలో నకిలీ విత్తనాల విక్రయాలపై బీజేపీ నాయకులు శుక్రవారం మండల వ్యవసాయ అధికారి శిరీషకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నర్సింహయాదవ్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు లభించకపోతే తీవ్రంగా నష్టపోతారన్నారు. వ్యవసాయ అధికారులు స్పందించి నాసిరకం విత్తనాల విక్రయాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కరెడ్ల నరేందర్‌రెడ్డి, కుమ్మరి మహేష్, తిరుపతి, కుమారస్వామి, గోపాల్‌రెడ్డి, పారేష, ప్రతాప్‌రెడ్డి, చందు, పాండు తదితరులు పాల్గొన్నారు.

పాల బిల్లులు విడుదల చేయండి

ఎంపీ మల్లురవి, విజయ డెయిరీ జీఎంకు పాడిరైతుల వినతి



మల్లురవికి వినతిపత్రం అందజేసిన పాడిరైతులు

కడ్తాల్: విజయ డెయిరీ నుంచి పాడిరైతులకు రావాల్సిన పెండింగ్ పాలబిల్లులు వెంటనే చెల్లించాలని పాల ఉత్పత్తిదారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రంలోని పాల ఉత్పత్తిదారులు, పాడిరైతు సంఘం నాయకులు ఎంపీ మల్లురవి, విజయ డెయిరీ జనరల్ మేనేజర్ మల్లయ్యను కలిసి వినతిప్రతం అందజేశారు. వారు మాట్లాడుతూ.. విజయ డెయిరీ పాడిరైతుల నుంచి సేకరించిన పాలకు ఏప్రిల్ 16 నుంచి పాలబిల్లులు అందించకపోవడంతో పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.